క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రాజానగరం: పాతతుంగపాడుకు చెందిన పదో తరగతి విద్యార్థి బండి విజయ కుమార్‌కు దివాన్‌చెరువులోని సేవా ఉగాది తరపున శుక్రవారం రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల ఆ విద్యార్థి తండ్రి మరణించాడు. పైచదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతోఈ సాయాన్ని అందజేశామని సేవాఉగాది సభ్యులు తెలిపారు. ఈ సంస్థ ద్వారా పేదలకు అన్నదానంతోపాటు పేదరికంలో ఉన్న విద్యార్థులకు కూడా అవకాశం మేరకు సాయమందిస్తుంటారు.

దుర్గాదేవికి లలితా సహస్ర నామార్చన



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

రంగంపేట: చంద్రేడులో కొలువైన దుర్గాదేవికి లలితా సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో పౌర్ణమి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఉదయం, సాయంత్రం కుంకుమ పూజ చేశారు. అమ్మవారిని భక్తులు సమర్పించిన వివిధ రకాల పూలతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పౌర్ణమి సందర్భంగా బ్రాహ్మణులకు మహిళలు విసనకర్రలు, మామిడి పండ్లు సమర్పించి ఆశీర్వచనాలు పొందారు.

ఘనంగా తీర్థ మహోత్సవం



పందలపాక కట్లమ్మ తల్లి

బిక్కవోలు: బిక్కవోలు మండలం పందలపాకలో కొలువైయున్న కట్లమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ఈకేవైసీ



ఈకేవైసీ చేస్తున్న ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కోరుకొండ ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ శుక్రవారం మండలంలోని విశ్రాంత ఉద్యోగ ఉద్యోగులకు ఈకేవైసీ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 30 మందికి సేవలందించారు. వీరందరూ కోరుకొండ ట్రెజరీ వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అయితే వీరి సౌకర్యార్థం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.

అరుణోదయ రామారావుకు నివాళి

మధురపూడి: అరుణోదయ రామారావు వర్ధంతిని కోరుకొండ మండలం కాపవరంలో శుక్రవారం నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు కె.వెంకట నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండలంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

9న జీపుల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయంలో ఈనెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు రెండు జీపుల వేలం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవిందు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలం సొమ్ముకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ కట్టాలన్నారు. జీపులను పరిశీలించడానికి కార్యాలయం పనివేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు సంప్రదించాలన్నారు.

ప్రయాణం.. ఆహ్లాదం..

- జాతీయ రహదారి 516ఈ అభివృద్ధి
- రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు హ్యాపీ జర్నీ



గమ్యస్థానాల వివరాలు తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డు



జాతీయ రహదారి 516ఈ పై ప్రయాణికుల రాకపోకలు

మధురపూడి: రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ నిర్మించిన 516ఈ జాతీయ రహదారిపై ప్రయాణం రయ్‌రయ్‌మంటూ సాగుతోంది. గతంలో రాష్ట్రీయ రహదారిగా పిలువబడిన దీనికి జాతీయ రహదారి గుర్తింపు వచ్చింది. వెనువెంటనే ప్రయాణానికి మరింత వీలుగా అభివృద్ధి చేయబడింది. రహదారికి ఇరువైపులా ప్రమాద సూచికలు, చేరాల్సిన గమ్యం వివరాలు తెలుపుతూ బోర్డులు, అనుసంధానించిన రోడ్ల వద్ద సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. గతంలో ఎయిర్‌పోర్టు రోడ్డుగా, తర్వాత రాష్ట్రీయ రహదారిగా పిలువబడే ఈ రోడ్డు ఇప్పుడు జాతీయ రహదారి 516ఈగా అభివృద్ధి చెందింది. రాజమహేంద్రవరం నుంచి మధురపూడిలోని విమానాశ్రయం వరకూ అభివృద్ధి చెందిన ఈ రహదారి జాతీయ హోదాతో రంపచోడవరం సమీపంలోని పోలవరం, కాకరపాడు జంక్షన్ (కొయ్యూరు), చింతపల్లి, లంబసింగి, జి.మాడుగల, పాడేరు, అరకు, తాడిపూడి మీదుగా విజయనగరం చేరుతుంది. ఈ రోడ్డు ఏజెన్సీ ప్రాంతం మీదుగా వెళుతుండడంతో దీనిపై ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది.

అభివృద్ధి ఇలా..

జాతీయ రహదారి 516 ఈ అభివృద్ధి, విస్తరణ పనులు చురుకుగా జరిగాయి. ఇది తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల మీదుగా విజయనగరం చేరుతుంది. కోరుకొండ మండలం బూరుగుపూడి అయ్యన్న గళ్ల కాలువ వంతెన నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా ఐ.పోలవరం వరకూ 43.7 కిలోమీటర్ల మేర విస్తరించబడింది. ఐ. పోలవరం నుంచి మరో 70 కిలోమీటర్ల మేర నిర్మించబడిన రహదారిలో ప్రయాణాలు సుఖంగా సాగుతున్నాయి.

ప్రమాద రహితంగా..

అన్ని హంగులతో నిర్మించిన ఈ రహదారిలో ప్రయాణం చాలా సులభంగా, సౌకర్యంగా ఉంటుంది. ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్ లైట్లు, ప్రమాదకరమైన ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాద రహితంగా తీర్చిదిద్దబడింది. అధునాతనమైన పద్ధతుల్లో, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఈ రోడ్డును నిర్మించారు.

రూ. 40 కోట్లతో ఏర్పాటు



ఈ జాతీయ రహదారిని తూర్పుగోదావరి జిల్లాలో రూ.40 కోట్లతో అభివృద్ధి చేశారు. విస్తరణ పనుల్లో భాగంగా 20 కల్వర్టులు, రెండు మైనర్ బ్రిడ్జిలు నిర్మించారు. రహదారిలో ఐదు ప్రమాదకరమైన మలుపులను తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యింది.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆధునికంగా..

ఈ రహదారి నిర్మాణంలో ఆధునిక పద్ధతులు పాటించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ కారణంగానే నిర్మాణం జరిగింది. రహదారిలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు నిర్మించాం. ఈ రోడ్డుపై ప్రయాణం సుఖంగా, సౌకర్యవంతంగా ఉంటుంది.

– ఎస్.శ్రీనివాసరావు, జేఈ, జాతీయ రహదారుల శాఖ

దేవాలయాలకు శంకుస్థాపన



మునగాలలో గణపతి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: మండలంలోని పలు గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. మునగాల, శ్రీరంగపట్నం గ్రామాల్లో గణపతి ఆలయాలు, రాఘవపురం, గాదరాడల్లో రామాలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, మండపాక కోటేశ్వరరావు, చింతపల్లి లోవరాజు, సత్యనారాయణ, ఆరగోలు చిన బాబు, అత్తిలి రాంప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కొంకుదురులో కలెక్టర్ పర్యటన

బిక్కవోలు: బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామంలో జిల్లా కలెక్టర్ మాధవీలత శనివారం పర్యటిస్తారని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. శుక్రవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కలెక్టర్ మాధవీలత ఉదయం 10 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శిస్తారని, అనంతరం హౌసింగ్ డే సందర్భంగా గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌లను పరిశీలిస్తారన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించండి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అంగన్‌వాడీ టీచర్లకు నియామక పత్రాల అందజేత



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఎంపికైన వారు బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఎంపికైన అంగన్‌వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమూల మార్పులకు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ....

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నియోజకవర్గంలోని పెదపూడి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.2.90 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకుండా అత్యవసర వైద్య సేవలు పొందిన నిరుపేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు పోతుల ప్రసాదరెడ్డి, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, కేతా శ్రీనివాస్, సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మా సినిమాను ఆదరించండి



విద్యార్థినులతో సెల్ఫీలు తీసుకుంటున్న హీరో, హీరోయిన్లు

రాజానగరం: మా సినిమాను చూసి ఆదరించాలని 'ఏ స్టోరీ ఆఫ్ బ్యూటిఫుల్ గర్ల్' చిత్ర బృందం కళాశాల విద్యార్థినులకు విజ్ఞప్తి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలకు శుక్రవారం సాయంత్రం విచ్చేసింది. హీరో నిహాల్, హీరోయిన్ ద్రిషిక చందర్, దర్శకుడు రవి ప్రకాష్ మాట్లాడుతూ సినిమాలోని ప్రత్యేకతలను తెలియజేశారు. యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో కూడిన ఫ్యామిలీ డ్రామాగా పేర్కొంటూ విద్యార్థినులతో సెల్ఫీలు దిగారు. ఈ సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

తంటికొండ వెంకన్నకు శ్రీచక్రస్నానం

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి శ్రీచక్రస్నానం, గ్రామోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామి వారి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజారోహణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, వివిధ వేషధారణల నడుమ స్వామివారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తంటికొండ వెంకన్నకు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వేసవి సెలవులను వృథా కానీయొద్దు



విద్యార్థులకు పేపర్ ఐటెమ్స్ తయారీ విధానాన్ని వివరిస్తున్న అనూష

రంగంపేట: విద్యార్థులు వేసవి సెలవులను వృథా కానీయొద్దని స్థానిక ఎస్వీఎస్ విద్యా సంస్థల అధినేత బోళ్ళ అనూష సూచించారు. శుక్రవారం స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో నిర్వహించిన బాల వికాస్ వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఇంట్లో వృథాగా ఉన్న శుభలేఖలు, వివిధ కాగితాలను ఉపయోగించి ఆకర్షణీయమైన వస్తువులు తయారు చేయడంలో విద్యార్థులు నైపుణ్యాన్ని సాధించాలన్నారు. పనికి రాని కాగితాలతో అందమైన పువ్వులు, బొకేలు ఎలా తయారుచేయొచ్చో ఆమె వివరించారు. అనంతరం విద్యార్థులకు లెమన్ స్పూన్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, మండల సత్సంగ్ కన్వీనర్ మల్లిడ్డి వీర్రాజు, సేవాదళ్ సభ్యులు వెంకట్రావు, రంగమాంబ, హేమ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట వివరాల సేకరణ

అనపర్తి: అకాల వర్షాల కారణంగా మండలంలోని దెబ్బతిన్న పంట వివరాలను సేకరిస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ రబీ సీజన్‌లో మండల పరిధిలో 9,200 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టగా ప్రస్తుతం 80 శాతం కోతలు పూర్తయినట్లు ఆయన చెప్పారు. వర్షాల కారణంగా 260 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, అదేవిధంగా కల్లాల్లో ఉన్న సుమారు 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం పాడైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని తెలిపారు.

దెబ్బతిన్న పంట వివరాల సేకరణ

అనపర్తి: అకాల వర్షాల కారణంగా మండలంలోని దెబ్బతిన్న పంట వివరాలను సేకరిస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ రబీ సీజన్‌లో మండల పరిధిలో 9,200 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టగా ప్రస్తుతం 80 శాతం కోతలు పూర్తయినట్లు ఆయన చెప్పారు. వర్షాల కారణంగా 260 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, అదేవిధంగా కల్లాల్లో ఉన్న సు మారు 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం పాడైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తీర్థం

కడియం: దుళ్ల గ్రామదేవత పోలేరమ్మ తీర్థమహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రెండు రోజులుగా గ్రామస్తులు, దాతల సహకారంతో కన్నుల పండువగా జాతర నిర్వహించిన విషయం తెలిసిందే. ఏటా వైశాఖ పౌర్ణమినాడు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు, ఆడపడుచులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జీరో ప్లాస్టిక్ మార్కెట్‌గా అల్లూరి జంక్షన్

రాజమహేంద్రవరం సిటీ: అల్లూరి సీతారామరాజు జంక్షన్‌ను జీరో ప్లాస్టిక్ మార్కెట్‌గా తయారు తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు డివూన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనేకుల లావణ్య తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో జాంపేట చిన్నగాంధీ బొమ్మ జంక్షన్ నుంచి అల్లూరి సీరామరాజు కూడలి వరకూ మార్కెట్‌ను జీరో ప్లాస్టిక్‌గా తయారు చేస్తామన్నారు. ఇందుకోసం రైతుబజారులోని రైతులు, వ్యాపారులు, సైకిల్ వ్యాపారులు, షాపు యజమానులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతిషాపు వద్ద తప్పని సరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని అవగాహన కల్పించారు.

మొబైల్స్ కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి



మొబైల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో ఎస్సై శివనాగబాబు

గోకవరం: మొబైల్ షాపుల నిర్వాహకులు సెకండ్ హ్యాండ్ మొబైల్స్ అమ్మకాలు, కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని గోకవరం ఎస్సై యువి శివనాగ బాబు సూచించారు. గోకవరం ప్రెస్‌క్లబ్ భవనంలో శుక్రవారం మొబైల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ ఆధారాలు లేకుండా మొబైల్స్ కొనుగోలు, విక్రయాలు చేయరాదన్నారు. అనుమానాస్పదంగా మొబైల్ విక్రయాలు చేస్తున్నారని అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా షేక్ గని, ప్రధాన కార్యదర్శిగా టి.విజయ్ బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఎంపీ భరత్ రామ్‌కు కాంట్రాక్ట్ లెక్చరర్ల వినతి



ఎంపీ భరత్ రామ్‌కు వినతి పత్రం అందిస్తున్న మాణిక్యం తదితరులు

సీటీఆర్ఐ: తమ సర్వీసు క్రమబద్ధీకరణ త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్ల మాణిక్యం.. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కోరారు. రాజమహేంద్రవరం శుభమస్తు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌కి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 142, 143 జీవో ద్వారా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లగా తామంతా ఒకేసారి చేరామన్నారు. తమతో పాటు చేరిన సహచర తెలంగాణ కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పి.సూర్య నారాయణమూర్తి, ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుమార్తె వైద్యం కోసం ముఖ్యమంత్రికి లేఖ

ప్రకాశం నగర్: నగరానికి చెందిన పుట్టా వీర వెంకట లక్ష్మీనారాయణ తన కుమార్తె సాయి దీపిక వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం అందజేసి, ఆమెకు ప్రాణభిక్ష పెట్టాలని అభ్యర్థిస్తూ శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశాడు. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీనారాయణ భార్య, ఇద్దరు కుమార్తెలతో స్థానిక మున్సిపల్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆయన పెద్ద కుమార్తె, 22 ఏళ్ల సాయి దీపిక బీటెక్ పూర్తి చేసింది. మూడేళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆమెకు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా, రెండు ఊపిరితిత్తులూ 50 శాతం పైగా పాడైపోయాయని, ఊపిరితిత్తుల మార్పిడియే ఏకైక మార్గమని వైద్యులు సూచించారు. ఇందుకోసం సుమారు రూ.33.50 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటి వరకు చాలా ఖర్చుచేసి ఉన్న లక్ష్మీనారాయణకు అంత సొమ్ము ఖర్చు చేసి వైద్యం అందించే స్థోమత లేదు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరాడు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మార్కండేయ ఫీడర్‌కు వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. నగరంలోని కంభం వారి సత్రం, వంకాయల వారి వీధి, మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టౌన్ హాల్ రోడ్డు, మెరక వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లి వారి వీధి, న్యాపతి వారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, శివరామ కలర్ ల్యాబ్ ఏరియా, కోటిపల్లి బస్టాండ్, కొత్తపేట, మంగళవారపు పేట, భారత్ బొమ్మలు రోడ్, ట్రైనింగ్ కాలేజీ, నాగులు చెరువు బజార్, కొబ్బరి కాయల మార్కెట్, నెహ్రూ జంక్షన్, నేతాజీ స్కూల్ సెంటర్, భావనా ఋషి గుడి, ఇసుక వీధి, నాళం భీమరాజు వీధి, రంగ్రీజు పేట, చందా సత్రం, గుండువారి వీధి, సదనం, గోదావరి బండ్, వంకాయలవారి వీధి, పుష్కరఘాట్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

మార్క్స్ సిద్ధాంతమే ప్రపంచానికి దిక్సూచి

ప్రకాశం నగర్: మార్క్స్ సిద్ధాంతమే ప్రపంచానికి దిక్సూచి అని ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. పేపర్ మిల్లు వద్దగల బీటీఆర్ భవన్‌లో శుక్రవారం కారల్ మార్క్స్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక మాంద్యం, ప్రపంచ దేశాలు అనే అంశంపై సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. కారల్ మార్క్స్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సుకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎస్.మూర్తి, బి.పవన్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో మల్టీ లెగ్ ట్రావెల్ టికెట్ సదుపాయం

రాజమహేంద్రవరం సిటీ: దూర ప్రాంతాలు వెళ్లాల్సిన ప్రయాణికులకు డైరెక్ట్ సర్వీసు లేకపోతే ఒకే టికెట్‌పై కనెక్టింగ్ బస్సుల్లో ప్రయాణించేలా మల్టీ లెగ్ ట్రావెల్ టికెట్ (ఎంఎల్‌టీటీ) సదుపాయం కల్పిస్తున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రాజమహేంద్రవరం నుంచి అనంతపురం, కుప్పం, రాయచూర్ వెళ్లడానికి ఈ సదుపాయం కల్పించామన్నారు. రిజర్వేషన్ టికెట్‌కు అయ్యే సర్వీసు చార్జీ ఎంఎల్‌టీటీ టికెట్‌కు అవుతుందన్నారు. ఉదాహరణకు రాజమహేంద్రవరం నుంచి కుప్పం వెళ్లాలంటే డైరెక్ట్ బస్సు రాజమహేంద్రవరం నుంచి లేనందున.. ఎంఎల్‌టీటీ టికెట్ కొనుగోలు చేసి రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు వెళ్లి అదే టికెట్‌తో విజయవాడ నుంచి కుప్పం బస్సులో ప్రయాణించవచ్చన్నారు. ఈ పథకం విజయవంతమైతే మరిన్ని ప్రాంతాలకు అమలు చేస్తామన్నారు.